సాక్షి సిద్దిపేట

శనివారం । 25 । మార్చి । 2023



పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య

పాత కక్షలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈసంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో శుక్రవారం చోటు చేసుకుంది. 8లో..



రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడులు

శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ పరిధిలోని ఓ రైస్‌మిల్లును విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సుమారు రూ. 2 కోట్ల బియ్యం పక్కదారి పట్టినట్టు గుర్తించారు. 8లో..




ఆదాయ పెంపుపై దృష్టి పెట్టాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన శుక్రవారం రూ.19.81కోట్ల అంచనాతో 2023-24 ఏడాది మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 9లో..



న్యూస్‌రీల్

క్రైమ్ రేటు తగ్గించాలి
పోలీస్ కమిషనర్ శ్వేత



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్వేత

కొమురవెల్లి(సిద్దిపేట): క్రైమ్ రేటును తగ్గించేందుకు అధికారుల సమన్వయంతో పనిచేయాలని సీపీ ఎన్.శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదువుతున్న కేసులు, సిబ్బంది వివరాలపై ఎస్‌ఐ చంద్ర మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, రౌడీలు, కేడీలు, సంఘ విద్రోహశక్తులపై నిరంతరం నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సీఐ సత్యానారాయణరెడ్డికి సూచించారు.

గ్రూప్-1కు ఉచిత శిక్షణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: గ్రూప్-1కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణ దయాసాగర్ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 28 వరకు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 29 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, గతంలో శిక్షణ పొందినవారు అనర్హులు అని అన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, నెలకు రూ.5వేలు స్టైఫండ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ జిల్లా కార్యాలయంలో లేదా 0878-224941 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: భద్రాచల దేవస్థానంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే వసంత పక్ష పుష్కరోత్సవ సంబంధిత వాల్‌పోస్టర్‌ను శుక్రవారం గజ్వేల్‌లో రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ భద్రచాల రామునివారి సన్నిధిలో గజ్వేల్ ప్రాంత భక్తులకు గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిరాణ వర్తకసంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, సభ్యులు మెట్రాములు, యాదగిరి, శ్రీనివాస్, వైకుంఠం, సత్యనారాయణ, లక్ష్మణ్, ప్రభాకర్, లక్ష్మయ్య, సత్యనారాయణ, లింగం, ఓంకార్ ఉన్నారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం
సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య

జనగామ రూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టు పరిశ్రమతో ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తుందని, రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేలమందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. శాస్త్రవేత్తలు, వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రధాన పార్టీలు

- 'ఆత్మీయ సమ్మేళనా'లకు బీఆర్‌ఎస్ శ్రీకారం
- 'హాథ్ సే హాథ్ జోడో' అంటున్న కాంగ్రెస్
- 'కార్నర్ మీటింగ్స్'తో బీజేపీ బిజీ
- 'మోదీకో హఠావో..దేశ్‌కో బచావో'తో యాత్రకు సిద్ధమవుతున్న సీపీఐ



సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలన్ని జనం బాట పట్టాయి. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయి. ప్రజలను ఆకట్టుకునేందుకు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఆత్మీయ సమ్మేళనాలతో అధికార బీఆర్‌ఎస్, హాథ్ సే హాథ్ జోడో యాత్ర పేరుతో కాంగ్రెస్, కార్నర్ మీటింగ్‌తో బీజేపీ ప్రజల మధ్య ఉండేలా చూసుకుంటున్నాయి. త్వరలో మోదీకో హఠావో..దేశ్‌కో బచావో పేరుతో సీపీఐ యాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రధాన పార్టీలన్ని ఎన్నికల సమరానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

మంత్రి హరీశ్ రావు సారధ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడకుంట వెంకటేశ్వర్లును నియమించారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి, 25న పార్టీ జెండా ఆవిష్కరణ, ఏప్రిల్ 27న ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. జనగామ నియోజకవర్గం పరిధిలో దూల్మిట్ట మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27న చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో, 28న కొమురవెల్లి, 29న చేర్యాల పట్టణం, ఏప్రిల్ 5న ఆకునూరులో సమ్మేళనాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోనూ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

గడపగడపకు కాంగ్రెస్

హాథ్ సే హాథ్ జోడో యాత్ర పేరుతో జిల్లాలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేస్తున్నారు. ఈ నెల 2న హుస్నాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గంలో శ్రీనివాస్ రెడ్డి పాదయాత్ర చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రూ.2లక్షల రుణ మాఫీ, రూ.500లకే వంటగ్యాస్, ధరణి పోర్టల్ రద్దు అంటూ హామీలు ఇస్తున్నారు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్‌లో సైతం పాదయాత్ర చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

బిజీ బిజీగా బీజేపీ..

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలనే పార్టీ అధిష్టానం ఆదేశాలతో అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. దుబ్బాకలో ఎమ్మెల్యే రఘునందన్ రావు, హుస్నాబాద్‌లో శ్రీరాంచక్రవర్తి, సిద్దిపేటలో శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహిస్తూ ప్రజల్లో ఉంటున్నారు.

త్వరలో సీపీఐ యాత్ర..

సీపీఐ నాయకులు మోదీకి హఠావో..దేశ్‌కి బచావో నినాదంతో యాత్రలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు పాదయాత్ర, సైకిల్, బస్సు యాత్రలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. యాత్రల రూట్ మ్యాప్‌ను రూపొందించేందుకు ఈ నెల 28న సంగారెడ్డిలో సమావేశం నిర్వహించనున్నారు. ప్రజల చుట్టూ నేతలు తిరుగుతుండడం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది.



సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయల బ్లాక్

ఇంటిగ్రేటెడ్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్

- సిద్దిపేట మార్కెట్ అరుదైన ఘనత
- సేవలు, నాణ్యత ప్రమాణాల్లో మెరుగు
- సమష్టి కృషికి ఫలితమన్న మంత్రి హరీశ్

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తలమానికంగా మారింది. ఇక్కడి ఫిష్ మార్కెట్ బ్లాక్ రాష్ట్రంలో అన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లకు రోల్ మోడల్‌గా నిలిచింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఆహార నాణ్యత ప్రమాణాల గుర్తింపు సంస్థ) సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నందుకు సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌కు ఐఎస్ఓ-9001 సర్టిఫికెట్ సైతం దక్కింది. అంతర్జాతీయ సర్టిఫికెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఐఎస్ఓ 9001-2015క్వాలిటీ సర్టిఫికెట్ అందించింది. త్వరలో మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా పాలకవర్గం ఈ సర్టిఫికెట్‌ను అందుకోనుంది.

స్వచ్ఛతే లక్ష్యంగా...

సిద్దిపేట ప్రజలకు స్వచ్ఛతతో కూడిన, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కూరగాయలు, మాంసాహారం అందించేందుకు మంత్రి హరీశ్‌రావు రూ.25 కోట్లతో పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. కూరగాయలు, చికెన్, మటన్, ఫిష్, పండ్లు, పూల విక్రయాలకు అనుగుణంగా ప్రత్యేక బ్లాక్‌లను నిర్మించారు. వెజ్‌బ్లాక్‌లు 108, నాన్ వెజ్‌కు 92, ఫిష్ కోసం 23 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కూరగాయలకు ప్రత్యేక ప్లాట్ ఫామ్లు, ఫిష్‌బ్లాక్‌లో చేపలు శుభ్రం చేసేందుకు నీటి వసతి కల్పించారు. రైతులు, ప్రజలకు రెండు ఆర్‌ఓ ప్లాంట్లు, కమిషన్ ఏజెంట్లకు 23 దుకాణాలు, పార్కింగ్, గార్డెన్ ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ద్వారా ప్రతీనెలా రూ.7లక్షల ఆదాయం వస్తోంది. గత ఏడాది రాష్ట్ర ఫిషరీష్ శాఖ సిద్దిపేట ఫిష్ బ్లాక్‌ను సందర్శించి ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గుర్తింపు సాధించగా, 9001 సర్టిఫికెట్ రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యత పెరిగింది



సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడంతో మరింత బాధ్యత పెరిగింది. మంత్రి హరీశ్ రావు ఆలోచన మేరకు వెజ్, నాన్ వెజ్, ఫిష్, బ్లాక్‌లలో ఎల్లప్పుడూ స్వచ్ఛత పాటిస్తూ ప్రజలకు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నాం.జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ కు గుర్తింపు మంత్రి నిత్య పర్యవేక్షణ, చొరువతో సాధ్యం అయింది.

– విజిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

ఇదే స్ఫూర్తితో సాగాలి



సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రాష్టానికి ఆదర్శం. ఇప్పటికే కేంద్ర నాణ్యత ప్రమాణాల గుర్తింపు సంస్థ సర్టిఫికెట్ సాధించడం, ఇప్పుడు ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉంది. పాలకవర్గం సమిష్టి కషికి నిదర్శం.ఇదే స్ఫూర్తితో ప్రజలకు స్వచ్ఛమైన ,నాణ్యమైన వెజ్, నాన్ వెజ్ అందుబాటులోకి తెచ్చి ప్రజారక్షణ లో తోడ్పాటు అందించాలి.

– మంత్రి హరీశ్‌రావు

'ఎమ్మెల్యేల సస్పెండ్' మరిచారా?

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

గజ్వేల్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును బ్లాక్‌డేగా సీఎం కేసీఆర్ అభివర్ణించడం విడ్డూరంగా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. శుక్రవారం రాత్రి గజ్వేల్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 మార్చి 12న బడ్జెట్ సమయంలో గవర్నర్ ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్‌కుమార్ కాగితాలు విసిరారనే నెపంతో ఇద్దరిని అసెంబ్లీకి రాకుండా ఏడాదిపాటు సస్పెండ్ చేయడం మరిచారా అంటూ ప్రశ్నించారు. తన కూతురు కవితపై ఈడీ కేసును జీర్ణించుకోలేక కేసీఆర్ ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వేరు కాదనే విషయం అర్థమవుతుందని విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు పూర్తిగా సుప్రీం కోర్టు తీర్పు అని, స్వయం ప్రతిపత్తి కలిగిన కోర్టు తీర్పుతో బీజేపీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్ తదితరులున్నారు.


శ్రీరామనవమి వేడుకలకు మంత్రికి ఆహ్వానం

ములుగు(గజ్వేల్): ములుగు మండలంలోని క్షీరసాగర్‌లో ఈ నెల 30న నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు రావాలని మంత్రి హరీశ్‌రావును గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొన్యాల బాల్‌రెడ్డి, నర్సింగరావు, తారక సురేష్, సుదర్శన్ తదితరులు గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి ఆహ్వానం అందించారు.



మంత్రిని ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేర్యాలలో కరోనా కలకలం



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో ముగ్గురికి కరోనా సోకింది. కమిషనర్‌తో పాటు కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు తాత్కాలిక సిబ్బంది కరోనా బారిన పడ్డారు. జ్వరంతో బాధపడుతున్న కమిషనర్ రెండు రోజుల క్రితం పరీక్షలు చేసుకోగా పాజిటివ్‌గా తేలింది. దీంతో తనతో సన్నిహితంగా మెలిగిన వారంతా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించగా, కార్యాలయంలో మరో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులకు పాజిటివ్ వచ్చింది. కార్యాలయంలో ఒకేసారి ముగ్గురికి పాజిటివ్ రావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లద్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన కంపూట్యర్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ఎస్ఎంసీ చైర్మన్ పాకాల జయతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందించిన సాయంపై అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా 5వేల పాఠశాలల్లో గ్రంథాలయాలకు పుస్తకాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహరెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు పుట్ట వెంకటరమణరెడ్డి, పూర్వ విద్యార్థులు అన్నోజు కనకచారి, రాణి, వార్డు సభ్యులు అన్నోజు పుష్పఅంజలి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యక్ష ఓటింగ్



మాట్లాడుతున్న ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ అవిశ్వాస తీర్మాన విషయంపై హైకోర్టు ఆదేశాల మేరకు గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి శుక్రవారం సభ్యులతో ప్రత్యక్ష ఓటింగ్ నిర్వహించారు. కుకునూరుపల్లి మేజర్ పంచాయతీలో తలెత్తిన విభేదాలతో ఉపసర్పంచ్ జనగామ బాలాగౌడ్‌పై అవిశ్వాసం కోరుతూ 8మంది సభ్యులతో ఫిబ్రవరిలో ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. కాగా మెజారిటీ సభ్యుల మద్దతు తనకే ఉందని ఉపసర్పంచ్ బాలాగౌడ్ మార్చి 2న హైకోర్టును ఆశ్రయించాడు. ఈ క్రమంలో అవిశ్వాస విషయమై సభ్యులతో ప్రత్యక్ష ఓటింగ్ నిర్వహించాలని, ఫలితాలను వెల్లడించొద్దని కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో వార్డు సభ్యులతో ప్రత్యక్ష ఓటింగ్ నిర్వహించిన ఆర్డీఓ, నివేదికను కోర్టుకు సమర్పిస్తానని, తుది తీర్పు వచ్చేవరకు బాలాగౌడ్ ఉపసర్పంచ్‌గా కొనసాగుతాడని వెల్లడించారు. ఎస్‌ఐ పుష్పరాజ్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, కుకునూరుపల్లి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లం ఐలయ్య, కోఆప్షన్ అజీమొద్దీన్, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీఈఓ వీరరాజు, కార్యదర్శి మమత, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఉపాధ్యాయులకు ప్రతీ నెల 1న వేతనాలు అందించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు జిల్లా స్టీరింగ్ సభ్యులు వలీఅహ్మద్, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం యూఎస్ పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి, అనంతరం ట్రెజరర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు రాలేదని, ఉపాధ్యాయుల సప్లిమెంటరీ వేతనాలు, పీఆర్సీ, పెన్షనరీ బకాయిలు, సెలవు వేతనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని లేదంటే ఈనెల 28న హైదరాబాదులో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు యాదగిరి, మల్లిఖార్జున్, చంద్రభాను, భాస్కర్ రెడ్డి, గిరిబాబు, శివలింగం, కనకరాజు, శివాజీ, కిష్టయ్య, రజని, ఏసుమణి, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియానికి ఊతమిచ్చేనా?

- గతంలో జిల్లాలో మంచి ఫలితాలు
- బడ్జెట్ నిలిచిపోవడంతో వెనుకంజ
- కేంద్రం తాజా ప్రకటనతో ఉత్సాహం
- నిధుల విడుదలపైనే రైతుల ఆశలు



సేంద్రియ వరి సాగు

గజ్వేల్: సేంద్రియ సాగుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో అన్నదాతల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. రసాయన ఎరువుల ప్రభావం నుంచి నేలలను కాపాడేందుకు కేంద్రం సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టింది. గతంలో జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రధాన మంత్రి కృషి వికాస్ యోజన(పీకేవీవై) ద్వారా ఈ పథకం కింద సేంద్రియ సాగు ప్రారంభించి మంచి ఫలితాలు సాధించారు. క్రమంగా నిధులు నిలిచిపోవడంతో కొద్ది రోజులుగా రైతులు నిరాశలో ఉన్నారు. తాజాగా కేంద్రం ప్రకటన రైతుల్లో కొత్త ఉత్సాహం నింపింది. సేంద్రియ సాగు చేసేరైతులకు ప్రత్యేక గుర్తింపునిచ్చేందుకు సర్టిఫికెట్లు అందించి, సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు చెబుతుండడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా...

- వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారుగా 5.70లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి.
- యాసంగిలో మరో 2.50లక్షల ఎకరాల వరకు సాగవుతాయి.
- జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో యూరియా 63,811 మెట్రిక్ టన్నులు, డీఏపీ 25,524 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 20,419 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 49,474 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయి.
- యాసంగిలో మరో 90వేల మెట్రిక్ టన్నులకుపైగా ఎరువుల అవసరం ఉంటుంది.
- మోతాదుకు మించి ఎరువులను వాడటంతో నేల సారం తగ్గి ఏటా పంటల దిగుబడి తగ్గిపోతోంది.
- రసాయనిక ఎరువుల అధిక వినియోగంతో పంటల ఉత్పత్తుల్లో పోషకాలు లోపించి, కలుషితమవుతూ మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది.

నిధుల సమస్యతో..

- సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పీకేవీవై (ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన) ద్వారా నిధులు మంజూరు చేసింది.
- రూ.86లక్షలతో ఆరేళ్ల క్రితం సిద్దిపేట జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి మంచి ఫలితాలను సాధించారు.
- ఎంపిక చేసిన గ్రామాల్లోవానాకాలం, యాసంగి రెండు సీజన్లలో వరిని సేంద్రియ పద్ధతిలోసాగు చేశారు.
- గజ్వేల్ మండలం దాతర్‌పల్లిలో రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ధాన్యంపై అప్పట్లో వ్యవసాయశాఖ విస్తృత ప్రచారం కల్పించింది. దీంతో రైతుల వద్దకు నేరుగా వెళ్లి బియ్యాన్ని కొనుగోలు చేశారు.
- ఆరేళ్లుగా కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో రాయితీలు లేక రైతులు సేంద్రియ సాగుకు దూరంగా ఉంటున్నారు.
- మరో వైపు సేంద్రియ సాగుకు అవసరమైన సుడోమొనస్, ట్రైకోడర్మివిరిడి లాంటి జీవ నియంత్రణ ఎరువుల సరఫరా నిలిచిపోవడంతో రైతులకు ఆర్థిక భారం పెరిగి సాగును విడిచి పెడుతున్నారు.
- మరోవైపు ప్రైవేట్ సంస్థలు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడంతో రైతులు ఆసక్తి చూపడంలేదు.
- తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం సేంద్రియ సాగుకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించడంతో కొత్త ఆశలు రేకెత్తాయి.
- గతంలో మాదిరిగా బడ్జెట్ కేటాయింపులు జరిగితే మంచి ఫలితాలు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

జూన్ తర్వాతే స్పష్టత



సేంద్రియ సాగుతో జిల్లాలో గతంలో మంచి ఫలితాలు వచ్చాయి. ఇప్పటికీ కొందరు రైతులు సొంతంగా సేంద్రియ సాగు చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ఇలాంటి వారికి సలహాలు, సూచనలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. నిధుల కేటాయింపులపై స్పష్టత రాగానే రైతులకు సమాచారం అందిస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పాతకక్షలతో వ్యక్తి దారుణ హత్య

- జాలిగామలో నెలకొన్న ఉద్రిక్తత
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- విచారణ చేపట్టిన ఏసీపీ రమేశ్


ఏసీపీ రమేశ్‌తో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: పాత కక్షల నెపంతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన గజ్వేల్ మండలం జాలిగామలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన కామల్ల సత్తయ్య(50)కు భార్య యాదమ్మతో పాటు ముగ్గురు కొడుకులున్నారు. సత్తయ్య తన కున్న వ్యవసాయ భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. సత్తయ్యకు ఇదే గ్రామానికి చెందిన అతని బంధువులతో భూతగాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో నెల రోజుల క్రితం గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. గురువారం రాత్రి సత్తయ్య తన ఇంటి ముందు పడుకోగా...తెల్లారేసరికి తలకు బలమైన గాయాలై విగత జీవిగా కనిపించాడు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడు సత్తయ్య కుటుంబ సభ్యులు అనుమానితుల ఇంటిపైకి దాడికి దిగడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ వీరప్రసాద్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాల గాలింపు చేపట్టి హత్య ఘటనపై విచారణ చేపట్టారు.


సత్తయ్య (ఫైల్)


హత్యకు గురైన సత్తయ్య

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జాలిగామకు చేరుకొని మృతుడు సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనకు కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకునేవిధంగా చర్యలు తీసుకుంటానని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. అనంతరం గజ్వేల్ ఏసీపీ రమేశ్‌తో మాట్లాడారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ మంజూరైందంటూ ఫోన్ కాల్

- ప్రాసెసింగ్ ఖర్చులకు రూ.42,570 పంపిన బాధితుడు
- మోసాన్ని గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: లోన్ డబ్బులు మంజూరయ్యాయని, ప్రాసెసింగ్ ఖర్చుల నిమిత్తం డబ్బులు పంపాలని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ కాల్‌కు స్పందించి, డబ్బులు పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి మాట్లాడుతున్నానని నమ్మబలికాడు. మీకు రూ.3లక్షల లోన్ మంజూరయిందని మాట..మాట కలిపాడు. ఈ లోన్ డబ్బులు ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్, జీఎస్టీ, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.50వేలు పంపించాలన్నాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన ఫోన్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.42,570లు పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో

సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో తన స్నేహితుడి పేరుతో ఉన్న ఐడి ద్వారా తనకు అత్యవసరంగా డబ్బులు అవసరమని గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చేశాడు. అది నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.2,500 పంపించాడు. తర్వాత మోసం జరిగినట్లు అతను గుర్తించి జాతీయ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు, మెసేజ్‌లకు ఎవరూ స్పందించొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో కిసాన్ ఇండస్ట్రీస్ పరిశ్రమ దగ్ధం

మనోహరాబాద్(తూప్రాన్): అగ్ని ప్రమాదంలో కిసాన్ ఇండస్ట్రీస్ పరిశ్రమ దగ్ధమైన సంఘటన మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో కిసాన్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో కాపర్‌కు సంబంధించిన కాయల్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. నర్సాపూర్ నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ గంట పాటు శ్రమించి మంటలార్పినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ యజమాన్యం పేర్కొన్నారు.


ముప్పిరెడ్డిపల్లిలో దగ్ధమవుతున్న కిసాన్ పరిశ్రమ


నాగ్సాన్‌పల్లిలో దగ్దమైన ఇళ్లు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్ పల్లిలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ ఇళ్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన ఎర్ర సాకలి సాయిలు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్దమైంది. ఈ సంఘటనలో తన సోదరుని కూతురు వివాహానికి తెచ్చిన రూ.50 వేల నగదు, పెళ్లి బట్టలు దగ్ధమయ్యాయి.

కుళ్లిన గుడ్లు సరఫరా

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల మొర


కుళ్లిన కోడి గుడ్డులో నల్ల రంగు సొన

దుబ్బాక రూరల్: కుళ్లిన గుడ్లు సరఫరా అవుతునట్టు హబ్సిపూర్ గ్రామంలోని కొక్కడగల్ల లక్ష్మి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొంత మంది ప్రైవేట్ వ్యాపారులు కోళ్ల ఫామ్ నుంచి తక్కువ ధరకే, నాణ్యతలేని గుడ్లను తీసుకొచ్చి మండలంలోని పలు గ్రామాల కిరాణ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఆ దుకాణదారులు మాత్రం ధరను పెంచి అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తను ఓ దుకాణంలో 5 గుడ్లను కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి ఉడక బెట్టింది. దీంతో ఆగుడ్లు కుళ్లిపోయి, దుర్వాసన, నల్ల రంగులో ఉన్న సొన బయటికి వచ్చిందని లక్ష్మి వాపోయింది. వెంటనే ఆమె కిరాణ దుకాణ దారుడు వద్దకు వెళ్లి కుళ్లిపోయిన గుడ్లు వచ్చాయని నిలదీసింది. కిరాణా దుకాణాల్లో గుడ్లను సరఫరా చేస్తున్న వ్యాపారిని నిలదీయగా తాను కోళ్ల ఫామ్ నుంచి తీసుకొస్తున్నట్టు తనకేమితెలియదని సమాధానం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కోళ్ల ఫామ్ నిర్వహకునికి ఫోన్ చేసి అడిగారు. తమ ఫామ్ నుంచి నాణ్యమైన కోడి గుడ్లను సరఫరా చేస్తున్నట్టు వ్యాపారి బదులిచ్చాడు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి


కర్ర శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు క్షేమంగా బయట పడిన సంఘటన శుక్రవారం నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిలోని కసిల్ల ఫామ్ సమీపంలో జరిగింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి వస్తున్న హుండాయ్ కారు, నర్సాపూర్ వైపు నుంచి వెళ్తున్న ఇన్నోవా కార్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో హుండాయ్ కారులో ప్రయాణిస్తున్న కర్రశ్రీనివాస్(42)అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్నోవాలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. కర్ర శ్రీనివాస్ హైదరాబాద్ చింతల్‌లో నివాసం ఉంటూ మృదంగం ఆర్టిస్టుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నట్లు తెలిపారు. భార్య వీణధారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోరాటాలతోనే ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలి

మాజీ ఎంపీ, సోలిపేట రాంచంద్రారెడ్డి


మాట్లాడుతున్న సోలిపేట రాంచంద్రారెడ్డి

హుస్నాబాద్‌రూరల్: పోరాటాలతోనే ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలని మాజీ ఎంపీ ప్రజాతంత్రవాది సోలిపేట రాంచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర 6వ మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ రోజు రోజుకు క్షీణిస్తుందని, రాజకీయ పార్టీలకు ఎన్నికలపై ఉన్న ధ్యాస ప్రజా సమస్యల పరిష్కారంపై లేదన్నారు. ప్రజా సమస్యలను విస్మరిస్తే పేదల నుంచి తిరుగుబాటు, విప్లవం పుట్టుకొస్తాయని పోరాటలతోనే హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ పేదల సంఘం పోరాటాలను ముందుకు తీసుకెళ్లి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఖమ్మం, నల్గొడ, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కార్యకర్తలు తరలివచ్చి పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. ఈ బహిరంగ సభలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బివిఎస్ పట్నాయక్, ఐసీఎఫ్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ రెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జతిన్‌కుమార్, మూర్తి, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి విజయేందర్ రావు, కటకం రమేశ్, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి, గన్నెబోయిన రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

బండి కాదు మొండి ఇది.. సాయంపట్టండి



డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చే వాహనాలు ఏవిధంగా ఉండాలి.. మంచి ఫిట్నెస్‌తో ఉండాలి.. కానీ, శుక్రవారం డ్రైవింగ్ స్కూల్ వాహనం అంబేడ్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఎదుటే మొరాయించింది. దీంతో చేసేది ఏమీలేక ట్రాఫిక్ పోలీసులు వాహనం కొంచెం దూరం వరకు నెట్టి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. ఇది చూసిన పలువురు ఆర్టీఏ అధికారులు ఈ వాహనానికి ఎలా ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చారో అంటూ ముక్కున వేళ్లేశారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, సిద్దిపేట

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరు సమష్టిగా పనిచేసి క్షయ రహిత సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. క్షయ పీడితులను వెంటనే గుర్తించి, సకాలంలో పరీక్షలు నిర్వహించి, వారికి పూర్తి చికిత్స అందే వరకు సిబ్బంది అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, మంత్రి ఓఎస్డీ బాలరాజు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన బాలిక(14) గురువారం ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నవజాత శిశువు లభ్యం


నవజాత శిశువును తీసుకొస్తున్న ఎస్సై

కల్హేర్(నారాయణఖేడ్): చెట్ల పొదల్లో నవజాత శిశువు లభ్యమైన సంఘటన శుక్రవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం వెనుక వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..చెట్ల పొదల్లో శిశువు ఏడుపు వినపడటంతో చుట్టుపక్కలో పనిచేస్తున్న మహిళా కూలీలు అక్కడికి వెళ్లి చూసే సరికి నవజాత శిశువు వారి కంటబడింది. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమచారం ఇచ్చారు. ఎస్ఐ నారాయణ అక్కడికి వెళ్లి శిశువును బయటకు తీసుకొచ్చారు. శిశువు ఆరోగ్యంగా ఉండడంతో సంగారెడ్డిలోని శిశు సంరక్షణ కేంద్రనికి తరలించారన్నారు.

చరిత్రాత్మక వేతన ఒప్పందం సాధిస్తాం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో మెరుగైన చారిత్రాత్మక వేతన ఒప్పందాన్ని సాధిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్ష అభ్యర్థి చుక్క రాములు అన్నారు. మద్దికుంట శివారులోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో రిటైర్డ్‌మెంట్ కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ కల్పిస్తామన్నారు. కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్న తనకు ఓటేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, మల్లేశం, ప్రవీణ్ కుమార్, సాయిలు, పాల్గొన్నారు.

మత్స్యకారుడు మృతి

మద్దూరు(హుస్నాబాద్): చేపలు పట్టేందుకు రిజర్వాయర్లోకి వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని లద్నూరు రిజర్వాయర్లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరికి చెందిన దాసరి శ్రీనివాస్(45)తో పాటు 50 మంది మత్స్యకారులు రిజర్వాయర్లో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపల కోసం వలలు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల కాలుకు తట్టి రిజర్వాయర్‌లో అతను పడిపోయాడు. మృతుని తమ్ముడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ట్రాలీఆటో ఢీ కొని వ్యక్తి..

నర్సాపూర్ రూరల్: ట్రాలీ ఆటో స్కూటీని ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. నర్సాపూర్, తూప్రాన్ రహదారిలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో శుక్రవారం జరిగింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మురళి(31) స్కూటీపై తూప్రాన్ నుంచి నర్సాపూర్‌కు వెళ్తున్నాక్రమంలో హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో తూప్రాన్ వైపుకు వెళ్తున్న ట్రాలీఆటో స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

కొత్తపేట రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ దాడులు

820 మెట్రిక్ టన్నుల బియ్యం గోల్‌మాల్


రెస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి రైస్‌మిల్లులో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైస్‌మిల్లులను తనిఖీ చేయాలని కలెక్టర్ రాజర్షిషా విజిలెన్స్ టీంలను ఏర్పాటు చేసి వారికి ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కొత్తపేట గ్రామ పరిధిలోని రైస్‌మిల్లులను హార్టికల్చర్ అధికారి నర్సయ్య, తూప్రాన్ ఆర్ఐ నాగరాజు, ఏఓ గంగమల్లు తనిఖీలు చేపట్టారు. 2022 యాసంగిలో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి రైస్‌మిల్లుకు కొనుగోలు కేంద్రం నుంచి ప్రభుత్వం 1396 మెట్రిక్ టన్నుల వడ్లు సరఫరా చేసింది. ఆ మిల్లునుంచి 936 మెట్రిక్ టన్నుల బియ్యం రావ్వాల్సి ఉండగా 116 టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారన్నారు. మిగితా 820 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్‌మిల్లులో స్టాక్ లేని విషయాన్ని అధికారులు గ్రహించారు. సుమారు రూ.2కోట్ల బియ్యం పక్కదారి పట్టినట్టుగా నిర్ధారించారు. ఈ విషయంపై సంబంధిత వివరాలను కలెక్టర్‌కు నివేదించినట్లు వారు తెలిపారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

జహీరాబాద్: వాహనం సర్వీసింగ్ విషయంలో నిర్వాహకుడిపై దాడిచేసిన కేసులో శుక్రవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 22 రాత్రి 7.30 గంటల ప్రాంతంలో జహీరాబాద్ పట్టణ శివారులోని ఘర దాభా సమీపంలోని శ్రీదత్త ఫోమ్ వాషింగ్ సెంటర్ వద్దకు శాంతినగర్‌కు చెందిన డి.నర్సింహారెడ్డి, బాగారెడ్డిపల్లికి చెందిన ఎస్.వేణు తమ మోటారు సైకిల్‌ను వాషింగ్ చేసి ఇవ్వాలని నాగరాజును కోరారు. ప్రస్తుతం కారును వాషింగ్ చేస్తున్నానని, పూర్తి కాగానే చేసి ఇస్తానని ఆయన సమాధానం ఇచ్చాడు. మోటారు సైకిల్‌ను వాషింగ్ చేయమని చెబితే తమనే ఆగమంటావా అంటూ వారు గొడవకు దిగారు. కర్రముక్కతో కొట్టి గాయపర్చాని ఎస్ఐ పేర్కొన్నారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

హాజరైన మాధవానంద సరస్వతీ స్వామి


మాధవానంద స్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో శుక్రవారం మాధవానంద సరస్వతీ స్వామి ఆశ్రమ దశమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. 108 మంది దంపతులచే సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలకు రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి విచ్చేసి కల్యాణ మండప ఆవరణలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మానవ జన్మకు దైవ చింతనతోనే విముక్తి కలుగుతుందన్నారు. దైవ సాన్నిధ్యానికి ధర్మ పరిరక్షణే అత్యంత దగ్గరిదారని రంగంపేట పీఠాదీశ్వరులు మాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. సనాతన ధర్మం ఎప్పుడూ శాంతి, సౌభ్రాతృత్వాన్ని కోరుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బస్వ సత్య ప్రకాష్, మాజీ అధ్యక్షుడు పోల రఘునాథ్, జోగిపేట మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లికార్జున్ గుప్తా, జిల్లా బ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ శర్మ, డీడీఎస్ అర్చక సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షుడు చిదిరె కృష్ణ మూర్తి శర్మ, స్వామి శిష్యులు జూకంటి లక్ష్మణ్ గుప్తా, నార్ల శంకర్ గుప్తా, పురం లక్ష్మణ్, మహిళా సంఘం అధ్యక్షురాలు గోలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సీఐ రామకృష్ణ


ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడపొద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణలు పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, మోటార్ వాహనాల చట్టం, రోడ్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. మానవ తప్పిదం, అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెంట్ ధరించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, సంబంధిత డాక్యుమెంట్స్ లేకుండా వాహనాలు నడిపే వారికి ఈ ఛలాన్ల ద్వారా ఫైన్‌లు వేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ లేజర్ గన్ ద్వారా రాజీవ్ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించడానికి కేసులు ఏవిధంగా నమోదు చేస్తామో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు బృందం, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏటీఎంలో దొరికిన డబ్బు సీఐకి అప్పగింత


సీఐ రవికుమార్‌కు డబ్బులను అందజేస్తున్న షబ్బీర్

సిద్దిపేట కమాన్: ఏటీఎంలో దొరికిన డబ్బును సీఐ రవికుమార్‌కు అప్పగించిన సంఘటన సిద్దిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం అంబేద్కర్ నగర్ రోడ్డులోని ఎస్‌బిఐ ఏటీఎం కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల క్రితం రూ.8 వేలు విత్ డ్రా చేసి ఏటీఎం మెషీన్‌పై పెట్టి వాటిని తీసుకోకుండానే వెళ్లిపోయాడు. ఏటీఎం పక్కనే చిన్న దుకాణం నడుపుతున్న షబ్బీర్ అనే వ్యక్తి ఆ డబ్బులను తీసుకుని ఏవరైనా డబ్బులు పొగొట్టుకున్న వారు వస్తారేమోనని ఎదురుచూశాడు. అలా మూడు రోజు లు గడిచినా ఎవరూ రాకపోవడంతో టూటౌన్ సీఐ రవికుమార్‌కు ఆ డబ్బులను అందజేశాడు. దీంతో సీఐ షబ్బీర్‌ను అభినందించాడు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జరిమానా

సిద్దిపేటకమాన్: పోలీసులను దుర్భాషలాడుతూ, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి సిద్దిపేట కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించింది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం గాంధీ నగర్‌కు చెందిన దున్నపోతుల పర్శరాములు ఈ నెల 22న వడ్డెర కాలనీ వద్ద విధుల్లో ఉన్న పోలీసులను దుర్భాషలాడుతూ, వారి విధులకు ఆటంకపర్చాడు. దీంతో వన్‌టౌన్ పోలీసులు అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. విచారణానంతరం జడ్జి నిందితునికి రూ.500 జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికీ న్యాయమూర్తి రూ.7వేల జరిమానా విధించినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల27న నిర్వహిస్తారని ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగ్రవాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలు ఉదయం 9.30నుంచి 5:45గంటల వరకూ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో జీహెచ్ఎంసీ ఆడిటోరియం, సంగారెడ్డిలో గాయత్రి హైస్కూల్లో, మెదక్‌లో గీత ఎడ్యుకేషనల్ సొసైటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పై మూడు కేంద్రాల్లో హాజరై సమస్య పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.